క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


వినోద్‌కుమార్, కర్నూలు ఇన్‌చార్జ్ ఎంఈఓ

కర్నూలు (న్యూటౌన్): ఆర్‌జేడీ ఆదేశాల మేరకు కర్నూలు ఇన్‌చార్జ్ ఎంఈఓగా కె.వినోద్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇన్‌చార్జ్ ఎంఈఓగా ఉన్న విజయ్‌భాస్కర్ క్రిష్ణగిరి ఇన్‌చార్జ్ ఎంఈఓగా బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన వినోద్‌కుమార్‌ను కార్యాలయ సిబ్బంది, వివిధ స్కూళ్ల హెచ్‌ఎంలు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనబడి నాడు–నేడు పనులు ముందుకు తీసుకెళ్తానని, జగనన్న గోరుముద్ద పకడ్బందీగా నిర్వహిస్తానని అన్నారు. ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని, అందరూ సమష్టిగా విధులు నిర్వర్తించి ప్రగతి సాధిద్దామని పిలుపునిచ్చారు.

‘సుంకేసుల’లో 1.152 టీఎంసీల నీటి నిల్వ

గూడూరు: ‘సుంకేసుల’ డ్యామ్‌లో 1.152 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు శుక్రవారం డ్యామ్ అధికారులు తెలిపారు. కర్నూలు నగర ప్రజల నీటి అవసరాలకు కేసీ కాల్వకు 104 క్యూసెక్కులు విడుదల చేసామన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

గూడూరు: మున్సిపల్ కాంటాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెన్షన్ సౌకర్యం, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శాంతన్న, గోపాల్, జైపాల్, రవికుమార్, దాసు, రత్నం, లక్ష్మిదేవి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం


మొక్కను నాటుతున్న విద్యార్థులు

ఓర్వకల్లు: విస్తాంగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండలంలోని కేతవరం గ్రామంలో కర్నూలు నగరంలోని సెయింట్ జోసఫ్ మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పర్యటించి, ఇంటింటికీ వెళ్లి పరిసరాల శుభ్రత, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సర్పంచ్ గోవర్ధన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చెన్నమ్మ మాట్లాడుతూ.. మన ఇంటితో పాటు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. వాటికి బదులుగా చెక్క, మట్టితో తయారు చేసిన వస్తువులను వాడాలని సూచించారు. తాగునీరు పొదుపుగా వాడుకోవాలన్నారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు గ్రామంలోని పలు చోట్ల మొక్కలు నాటారు. అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పథకం పేదలకు వరం

కర్నూలు (న్యూటౌన్): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేదలకు వరం లాంటిదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడు అన్నారు. శుక్రవారం కర్నూలు మండలం శివరాంపురంలో ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదిహేను రోజులకు ఒకసారి ఉపాధి కూలి చెల్లించాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

సి.బెళగల్: జగనన్న లేఔట్లలో జరుగుతున్న గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని, రోజువారీ పురోగతి ఉండేలా హౌసింగ్ అధికారులు, సిబ్బంది, ఇంజినీర్ అసిస్టెంట్లు ప్రర్యవేక్షించాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గృహ నిర్మాణాల పురోగతిపై హౌసింగ్, డీఆర్‌డీఏ–వైకేపీ, ఉపాధి అధికారులు, సచివాలయాల ఇంజినీర్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. గృహ నిర్మాణాలు ప్రారంభించకుంటే అనుమతులు రద్దు అవుతాయనే విషయాన్ని లబ్ధిదారులకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పొదుపు మహిళలకు బ్యాంక్‌ల ద్వారా రుణాలు ఇప్పించాలని వైకేపీ మండల ఏపీఎం వెంకటస్వామికి సూచించారు.

ఇంటింటికీ తాగునీరు

- ఏళ్లనాటి తాగునీటి సమస్యలకు చెక్ పెట్టిన ప్రభుత్వం
- కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలో వాటర్ గ్రిడ్ పనులు
- ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్

పాణ్యం: గ్రామీణ ప్రాంతాల్లో గుక్కెడు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. కేవలం నాలుగేళ్ల వ్యవధిలోనే కోట్లాది రూపాయల నిధులతో వాటర్ గ్రిడ్ నిర్మాణంతో ప్రజలకు తాగునీటి కష్టాలను శాశ్వతంగా పారదోలింది. అంతేగాక ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించేందుకు ‘ఇంటింటికీ కుళాయి కనెక్షన్’ ఏర్పాటు చేస్తోంది. మొదటి, రెండవ దశల్లోనే ఈ పనులు చకచకా పూర్తి చేశారు.

ముందస్తు ప్రణాళికతో పనులు

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి నియోజకవర్గంలో తాగునీటి సమస్యలున్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా పకడ్బందీగా చర్యలు చేపట్టి నాలుగేళ్లలో నీటి కష్టాల నుంచి గట్టెక్కించారు.

➡ పాణ్యం మండలంలో తాగునీటి వనరులు అయిన చేతిపంపులు 183 ఉండగా 23 మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. వీటికి తోడు 4 తాగు నీటి బావులు, ఒక సీపీడబ్ల్యూఎస్ ట్యాంక్ (సమ్మర్ స్టోరేజీ ట్యాంకు) ప్రజలకు అందుబాటులో ఉన్నాయి.

➡ తమ్మరాజుపల్లె గ్రామంలో 60 వేల లీటర్ల సామర్థ్యంతో రూ.23.33 లక్షలతో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు నిర్మించారు. అలాగే బలపనూరు గ్రామంలో రూ.40 లక్షలతో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకుతో పాటు ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చారు. గోరుకల్లు గ్రామంలో రూ.30 లక్షలతో పైప్‌లైన్, కొత్తూరులో రూ.15 లక్షలతో పైపులైన్ ఏర్పాటు చేసి 100 కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. గోరుకల్లు తండాలో రూ.25 లక్షలతో పైపులైన్‌తో పాటు 135 కుళాయి కనెక్షన్లు ఇచ్చారు.

➡ ఇక కొండమీద పల్లె అయిన కందికాయ పల్లె గ్రామంలో రూ.40 లక్షలతో పైప్‌లైన్ ఏర్పాటు చేసి ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చారు. తొగర్చేడులో రూ.3లక్షలతో కుళాయిలు, వడ్డుగండ్లలో రూ.25 లక్షలతో కుళాయి కనెక్షన్లు, అలాగే రసూల్ పేటలో రూ.5 లక్షలతో తాగునీటి పనులు చేయించారు. వీటికి తోడు నూతనంగా నిర్మించిన జగనన్న లేవుట్లలో మంచినీటి కోసం రూ.47 లక్షలు వెచ్చించి పనులు పూర్తి చేశారు.

➡ కల్లూరు మండలంలో అన్ని గ్రామాల్లో తాగునీటి పనులకు రూ.4.66 కోట్లు ఖర్చు చేశారు.

➡ అలాగే ఓర్వకల్లు మండలంలో నన్నూరు గ్రామానికి రూ.152.76 లక్షలు, శకునాలకు రూ.27.98 లక్షలు, లొద్దిపల్లెకు రూ.58.90 లక్షలు, గుట్టపాడుకు రూ.48.53 లక్షలు చొప్పున నిధులు కేటాయించి పనులు చేశారు. వీటితో పాటు అన్ని గ్రామాల్లో మంచినీటి సరఫరాకు రూ.13 కోట్లకు పైగా ప్రభుత్వం ఖర్చు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపింది.

➡ గడివేముల మండలంలో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రజలకు మంచినీటికి కొదవ లేకుండా పనులు చేశారు. మూడేళ్ల వ్యవధిలో మండలానికి ఏకంగా రూ.9.75 కోట్ల మేర నిధులు కేటాయించి పనులు దాదాపుగా పూర్తి చేశారు. ప్రస్తుతం ఇంటింటికీ కుళాయి, గ్రామాల్లో ఓహెచ్‌ఎస్‌ఆర్‌తో పాటు ఇతర తాగునీటి వనరుల సంఖ్య పెంచారు.


గోరుకల్లు తండాలో పైపులైన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ (ఫైల్)

తాగునీటి సౌకర్యానికి ప్రాధాన్యత



మా గ్రామంలో సురక్షిత మంచినీటి కోసం ఇప్పటివరకు రూ.20 లక్షల వరకు ఖర్చు చేశాం. వేసవి కాలంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుని అధికారుల సూచనలతో తాగునీటి ఎద్దడిని అరికట్టాం. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చొరవతో పనులు త్వరితగతిన పూర్తి చేశాం. ప్రస్తుతం నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాం.

– శేఖర్, సర్పంచ్, పెసరవాయి గ్రామం, గడివేముల మండలం

శరవేగంగా పనులు పూర్తి




తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో స్థానిక ప్రజా ప్రతినిధుల ఆదేశాల మేరకు ప్రతిపాదనలు తయారు చేసి పంపగా అందుకు తగినన్ని నిధులు కేటాయించడంతో పనులు చకచకా పూర్తి చేశాం. మండలంలో దాదాపు రూ.10 కోట్లకు పైగా తాగునీటి పథకాలకు ఖర్చు చేశాం. ఆయా గ్రామాల్లో నీటి వనరులన్నింటినీ ఉపయోగంలోకి తెచ్చాం. వేసవిలో ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా అరికట్టగలిగాం.

– మధు శేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

ట్రాక్టర్ డ్రైవర్ల నిరసన

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామంలో చేపడుతున్న సోలార్ పనుల్లో భాగంగా ప్రాజెక్టు పనులకు ట్రాక్టర్లను అద్దెకు తీసుకున్నారు. వారికి ఇచ్చే నెలవారి బాడుగ కంపెనీ చెల్లించకపోవడంతో ట్రాక్టరు యజమానులు శుక్రవారం నిరసన చేపట్టారు. కంపెనీకి రాకపోకలు సాగించే రస్తాకు అడ్డుగా ట్రాక్టర్లను పెట్టి ఆందోళనకు దిగారు. దాదాపు 8 నెలల నుంచి కంపెనీ బాడుగలు చెల్లించడం లేదని యజమానులు వాపోయారు. జోక్యం చేసుకున్న పోలీసులు ట్రాక్టర్ యజమానులతో మాట్లాడారు. వారికి సర్ధిచెప్పి పనులు యథావిధిగా జరిగేలా చేశారు.

అదనపు పీపీగా బాలరంగస్వామి



కర్నూలు(లీగల్) : కర్నూలు అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి (అడిషనల్ సబ్ కోర్టు) పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది జి.బాలరంగస్వామిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన 2002 సంవత్సరం నుంచి న్యాయవాది వృత్తి నిర్వహిస్తున్నారు. అదనపు పీపీగా 3 సంవత్సరాల పాటు విధులు నిర్వహిస్తారు. నెలకు రూ.25 వేల వేతనం చెల్లిస్తారు. బాలరంగస్వామి నియామకంపైబార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

ఖరీఫ్‌కు సమాయత్తం కావాలి

- ఆర్‌బీకే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలి
- ఏడీఏ సాలురెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సాలురెడ్డి

కోడుమూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది సమాయత్తం కావాలని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఏఓ రవిప్రకాష్ ఆధ్వర్యంలో కోడుమూరు, గూడూరు మండలాల వ్యవసాయ, ఆర్‌బీకే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వర్షాలు కురిస్తే రైతులు పొలాలను సాగుకు సిద్ధం అవుతారని, ఈ మేరకు సిబ్బంది సూచనలు చేయాలన్నారు. విత్తనాలు, మందులు ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయనే విషయాన్ని రైతులకు చేరవేయాలన్నారు. కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులను త్వరగా మంజూరయ్యేలా చూడాలని, పీఎం కిసాన్ ఈకేవైసీ త్వరగా పూర్తి చేయించాలన్నారు. అదేవిధంగా పొలంబడి ప్లాట్లను ఎంపిక చేసుకోవడంతో పాటు, ఏయే పంటలపై పొలంబడులు నిర్వహిస్తున్నామో రైతులతో చర్చించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని ఏడీఏ హెచ్చరించారు. సమావేశంలో సాంకేతిక వ్యవసాయ సహాయాధికారి దస్తగిరిరెడ్డి, గూడూరు ఏఓ శ్రీవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువుల సంతతిని పెంచుకోవాలి


పాడిరైతులనుద్దేశించి మాట్లాడుతున్న డా.రాజశేఖర్

కోడుమూరు: పాడిరైతులు పాడి పశువుల సంతతి పెంచుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పశుగణాభివృద్ధి సంస్థ ఉమ్మడి జిల్లా కార్యనిర్వహణాధికారి డాక్టర్ రాజశేఖర్ సూచించారు. శుక్రవారం కోడుమూరులోని పశువైద్యశాలలో ‘మేలు జాతి దూడల ప్రదర్శన’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువులకు ఎద సూదులు వేయించి ఈతకు ఈతకు మధ్య ఎడం తగ్గించాలని సూచించారు. లింగ నిర్ధారణ వీర్యం ద్వారా ఆడ దూడలు పుట్టే విధంగా చర్యలు తీసుకుంటే పాడి పశువులను గణనీయంగా పెంచుకోవచ్చునన్నారు. కర్నూలు డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ దుర్గాప్రసన్న బాబు మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం రూ.1350 ఉండగా, రైతుకు రూ.500 మాత్రమే పడుతుందని, పశువు చూడు కట్టకపోతే అది కూడా రైతుకు వాపాసు ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం 42దూడలకు నట్టల నివారణ మందులు తాపించి, బలమైన దూడల యజమానులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ రామసుబ్బారెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ సుబ్బారెడ్డి, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక విద్యార్థులకు వరం


విద్యా కానుక కిట్లు అందజేస్తున్న ప్రిన్సిపల్ వంశీమోహన్

సి.బెళగల్: ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్న జనన్న విద్యా కానుక వరమని సి.బెళగల్ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వంశీమోహన్ అన్నారు. శుక్రవారం ఆయన పాఠశాల ఉపాధ్యాయులు, మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దిలేటితో కలిసి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పేద విద్యార్థుల వివిద్యాభివృద్ధే లక్ష్యంగా ఉచితంగా దుస్తులు, బూట్లు, బ్యాగ్‌లు, పుస్తకాలు అందజేస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాఠశాలలో నాగుపాము కలకలం

పాఠశాల ప్రాంగణంలో ఉదయం నాగుపాము కనిపించడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు భయపడ్డారు. ప్రార్థన అనంతం విద్యార్థులు తరగతుల లోకి వెళ్లారు. అయితే పాము మెయిన్ గేట్ ద్వారా పాఠశాలలోకి వస్తుండగా ఉపాధ్యాయులు గమనించారు. స్థానికులు కాంపౌండ్ వరకు తరిమి చంపేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కల్లూరు: కౌలు రైతులందరికీ భూ యజమాని ప్రమేయం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి ఎ.కృష్ణ, సీఐటీయూ మండల కార్యదర్శి కె.మధు డిమాండ్ చేశారు. శుక్రవారం కల్లూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. కౌలు రైతులకు కౌలు కార్డులు లేకపోవడంతో పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, ప్రభుత్వ క్షేమ పథకాలు అందడం లేదన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఈ నెల చివరిదాకా కౌలు హక్కు కార్డులు ఇవ్వాలని తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతి పత్రం ఇచ్చారు. కౌలు రైతులు రాజేంద్ర ప్రసాద్, గోపాల్, నరసప్ప గౌడ్, ఉరుకుంద గౌడ్, హరిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామం బంగ్లా బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై వివాదాస్పదంగా మారిన ఫుట్ వే వంతెన నిర్మాణ పనులను నిలిపేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, సీఐటీయూ మండల అధ్యక్షుడు శ్రీధర్ వంతెన నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఫుట్ వంతెన వద్దు– ఫ్లై ఓవర్ వంతెన ముద్దు అని నినాదాలు చేశారు. నిరసనకారులకు స్థానిక ప్రజలు, విద్యార్థులు మద్దతుగా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రజల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఫుట్ వే వంతెనకు బదులుగా ఫ్లై ఓవర్ నిర్మించాలని, లేదంటే అండర్ వే నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 20వ తేదీన గ్రామస్తులను కూడగట్టి రహదారిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి మధుసూదన్, స్థానికులు మాసూంబాషా, ఆంజనేయులు, బషీర్, సలాం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

- పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాల వర్తింపు
- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్


మహిళ కుటుంబానికి వర్తించిన సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

గూడూరు రూరల్: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు అందాయని, కులమతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మండల పరిధిలోని చనుగొండ్లలో శుక్రవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. చనుగొండ్లకు వచ్చిన ఎమ్మెల్యే గ్రామస్తుల తోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వైస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. బుక్‌లెట్‌లోని వివరాల మేరకు సంక్షేమ పథకాలు అందాయా... లేదా అని లబ్ధిదారులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అర్హత మేరకు పథకాలు వర్తించాయని లబ్ధిదారులు ఎమ్మెల్యేకు తెలిపారు. గూడూరు నుంచి చనుగొండ్ల మీదుగా కోడుమూరు వరకు రోడ్డు పూర్తిగా పాడైపోవడంతో బస్సుల రాకపోకలు నిలిచిపోయాయని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. డ్రైనేజీ, సీసీ రోడ్ల ఏర్పాటు చేయాలని మహిళలు కోరగా స్పందించిన ఎమ్మెల్యేను ప్రాధాన్యత మేరకు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, కో–ఆప్షన్ సభ్యుడు దౌల, నాయకుడు మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీ రంగయ్య, హైస్కూల్ కమిటీ చైర్మన్ రంగయ్య, నరసింహారెడ్డి, శీను, ఎంపీడీఓ మాధవీలత, ఎస్‌ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే... మీ ముందుకు

చనుగొండ్ల గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజలను నేరుగా కలుసుకుని సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిందని గుర్తు చేశారు. ఇలాంటి కార్యక్రమం ఇంతవరకు ఎవ్వరూ చేయాలేని, మీ సమస్యలు పరిష్కరించేందుకే ఎమ్మెల్యేగా మీ ముందుకు వచ్చానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఒక్కొక్క సచివాలయానికి రూ. 20 లక్షల చొప్పున కేటాయించిందన్నారు. తొందరలోనే గూడూరు–కోడుమూరు రోడ్డు పనులకు భూమి పూజ చేస్తామని, డ్రైనేజీ, సీసీ రోడ్లు వంటి పనులను చేపడుతామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు మోసపూరిత హామీలను నమ్మొద్దని, ప్రజల వద్దకే పాలన సాగించేందుకు మరోమారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ కోరారు.

విద్యార్థులు తరగతులకు హాజరుకావాలి

గూడూరు రూరల్: జూలకల్ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో సీట్లు పొందిన విద్యార్థులు తరగతులకు హాజరుకావాలని శుక్రవారం ప్రిన్సిపాల్ దిల్షాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతి ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి సీటు పొందిన ప్రతి విద్యార్థి పాఠశాలకు రావాలన్నారు. విద్యార్థులకు అవసరమైన జగనన్న విద్యా కానుక కిట్లను అందిస్తున్నామని, తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపించేందుకు చొరవ తీసుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోండి


పోలకల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సి.బెళగల్: అంగన్‌వాడీల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తకోట సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి సూచించారు. శుక్రవారం ఆమె మండల పరిధిలోని పోలకల్ గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ సేవలపై మహిళలకు అవగాహన కల్పించారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని పిలుపునిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సూపర్‌వైజర్ మాట్లాడుతూ ప్రభుత్వం పేద మహిళలు, వారి పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసం సంక్షేమ పథకాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తుందన్నారు. మూడు సంవత్సరాల ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరారు.

21 ద్విచక్ర వాహనాలు సీజ్

కర్నూలు : నగరంలో మైనర్ డ్రైవింగ్‌పై శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో రాజ్‌విహార్, సి.క్యాంప్, ఓల్డ్ ఈద్గా, చెన్నమ్మ సర్కిల్ ప్రాంతాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న 21 మంది మైనర్లను అదుపులోకి తీసుకుని రూ.42,735 జరిమానా విధించారు. ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపటం, రోడ్డు భద్రత నిబంధనలకు విరుద్ధమని వారికి హెచ్చరించారు. తర్వాత కొత్తపేటలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులను పిలిపించి డీఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు.

చకచకా ‘గోరుకల్లు’ మరమ్మతు పనులు


గోరుకల్లు కట్టకు మరమ్మతులు జరుగుతున్న దృశ్యం

- నెలాఖరు కల్లా పనులు పూర్తి చేసేలా అధికారుల చర్యలు

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు కట్ట మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. ఎలాగైనా ఈ నెలాఖరు కల్లా పనులు పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇటీవలనే సీఈ కబీర్ బాషాతో పాటు క్వాలిటీ కంట్రోల్ అధికారులు పనులను పరిశీలించారు. శుక్రవారం పలువురు ఇంజినీర్లు పనులను పరిశీలించారు. ప్రస్తుతం బండ్‌ను బలోపేతం చేసే పనులు చురుగ్గా జరుగుతున్నాయి. కట్ట కుంగిన ప్రదేశంలో ఉన్న పిచ్చింగ్ రాళ్లు తొలగించారు. తొలగించిన తర్వాత మట్టి కట్ట కుంగిపోలేదని, కేవలం నీటి నిల్వ వల్ల రాళ్లు జారిపడ్డట్టు తెలుస్తోంది. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో సమస్యను తెలుసుకునేందుకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సూచనల మేరకు నీటి నిల్వను తగ్గించారు. ఎక్కడా కుంగిన ఆనవాళ్లు కనిపించలేదు. దీంతో ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో క్షేత్రస్థాయిలో అధికారులు పనులు ప్రారంభించారు. ప్రతి రోజు పనుల్లో పురోగతి కనిపిస్తోంది. ఈ పనులను ఈఈ, డీఈఈలు, ఏఈఈలు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు. ఎలాగైనా ఈనెలాఖరు కల్లా పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు కృషి చేస్తున్నారు. అందకు తగ్గట్టుగా పనులు చకచకా జరుగుతున్నాయి.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు


విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

కల్లూరు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బి.మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు ఇందిరమ్మ కాలనీ ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఏఏబీ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నరన్నారు. విద్యార్థులకు మంచి చదువులు అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శివరాం, గోపాల్‌రెడ్డి, నాగరాజు, నాగేశ్వరరావు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ


స్టాక్ వివరాలను పరిశీలిస్తున్న ఏడీఏ సాలురెడ్డి

కోడుమూరు : మండల కేంద్రం కోడుమూరులోని విత్తన, ఎరువుల దుకాణాల్లో శుక్రవారం సాయంత్రం కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, ఏఓ రవిప్రకాష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీవెంకటేశ్వర ట్రేడర్స్ దుకాణంలో అగ్ని వన్ రకం మిరప, విజయదుర్గ పింక్ కందుల విత్తనాలకు సంబంధించి సరియైన రికార్డులు లేకపోవడంతో రూ.3లక్షలు విలువైన 520విత్తన పాకెట్ల అమ్మకాలను నిలిపేశారు. ఏడీఏ మాట్లాడుతూ దుకాణదారులంతా విత్తనాలు, మందులు, ఎరువులకు సంబంధించిన రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని, వ్యవసాయ శాఖ అనుమతి పొందిన వాటినే విక్రయించాలని సూచించారు. అదేవిధంగా రైతులు కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు.